క్లుప్తంగా

ఎండీఎస్ బాపట్ల, ప్రకాశం జిల్లాల కోఆర్డినేటర్‌గా శాంతిరాజు



సత్తెనపల్లి: మహాజన దళిత సమితి (ఎండీఎస్) బాపట్ల, ప్రకాశం జిల్లాల రీజినల్ కోఆర్డినేటర్ గా ప్రకాశం జిల్లా మార్టూరుకు చెందిన ఉరవకొండ శాంతిరాజును నియామించారు. ఈ మేరకు పల్నాడు జిల్లా సత్తెనపల్లిలో ఎండీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు దీపాల పరంధామయ్య నుంచి బుధవారం శాంతిరాజు నియామక పత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా శాంతి రాజు మాట్లాడుతూ మాదిగ, దళిత, మహాజనుల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. బాపట్ల, ప్రకాశం జిల్లాల పరిధిలో ఎండీఎస్ భలోపేతానికి పనిచేస్తానన్నారు. కార్యక్రమంలో ఎండీఎస్ రాష్ట్ర కార్యదర్శి జమండ్లమూడి ప్రభాకర్, పాల్గొన్నారు.

3న వేణుగోపాలస్వామి ఆలయ వార్షికోత్సవం



నాదెండ్ల: సాతులూరు గ్రామంలో కొలువైయున్న శ్రీ రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాల స్వామి ఆలయం వార్షికోత్సవ వేడుకలు జూన్ 3న నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ ఛైర్మన్ అయినవోలు శివనాగేశ్వరరావు తెలిపారు. స్వామివారికి ప్రత్యేక పూజలు, పట్టు వస్త్రాలతో అలంకరణ, పూజా కార్యక్రమాలను పూజారి చిలకపాటి భరద్వాజ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఉదయం 11 గంటల నుండి అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పురాతన ఆలయం శిథిలావస్థకు చేరటంతో 2017న నూతన ఆలయాన్ని జీర్ణోద్ధరణ చేసి ప్రతిష్ట నిర్వహించారు. అప్పటి నుండి ప్రతి ఏడాది వార్షికోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి గురు, శనివారాల్లో పూజా, భజనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

లోఓల్టేజ్ సమస్య పరిష్కారం

శావల్యాపురం: లోఓల్టేజ్ సమస్య పరిష్కారానికి విద్యుత్ శాఖ చర్యలు చేపట్టింది. బుధవారం స్థానిక విద్యుత్ ఉప కేంద్రంలో ఏఈ సంపెంగుల గాంధీ మాట్లాడుతూ మండల కేంద్రంలో గత వారం రోజుల నుంచి లోఓల్టేజ్ సమస్య రావడంతో రైల్వే స్టేషను రహదారి మార్గంలో ఉన్న 100 కె.వి.సామర్థ్యం కళ్లిగిన ట్రాన్స్‌ఫార్మర్ పనులు యుద్ధ ప్రతిపాదికన ఏర్పాటు చేసినట్లు చెప్పారు. దీంతో 1000 ఇళ్లు నివాస గృహాలకు సమస్య పరిష్కారమైందన్నారు.

కౌలురైతు కార్డులకు దరఖాస్తు చేసుకోండి

ఏవో సీహెచ్ సరిత

యడ్లపాడు: కౌలుకు సాగు చేసే ప్రతిరైతు కౌలుకార్డు కలిగి ఉండాల్సిన అవసరం ఉందని మండల వ్యవసాయాధికారి సీహెచ్ సరిత చెప్పారు. బుధవారం ఆమె మాట్లాడుతూ భూమిలేకుండా కౌలుకు తీసుకుని ఖరీఫ్ సీజన్‌లో సాగుకు సన్నద్ధం అవుతున్న రైతులు తప్పక ఈ కార్డులను తీసుకుంటే అనేక ప్రయోజనాలు ఉన్నాయన్నారు. గతేడాది మండలం పరిధిలో సుమారు 1200 కార్డులు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ ఏడాది సుమారు 2000 వేల మంది వరకు ఇచ్చేందుకు లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించారు. అయితే కేవలం భూమిలేకుండా కౌలు చేసుకునే వారే కాకుండా భూమి ఉండి అదనంగా కౌలుకు తీసుకుని సాగు చేసుకునే రైతులకు కూడా ఈకార్డులను జారీ చేయనున్నట్లు చెప్పారు. కార్డు పొందిన కౌలు రైతులకు వైఎస్సార్ రైతుభరోసా ఆర్థికసాయం రూ.13,500, ఈ-క్రాప్ నమోదు, ఇన్‌ఫుట్ సబ్సీడీ, పంట కొనుగోలు, ఉచిత పంటబీమా,మద్దతుధర, పంటరుణాలు, వ్యవసాయ పథకాలు వర్తిస్తాయన్నారు. కావున కౌలు రైతులు భూయజమాని పట్టాదారుపాస్‌పుస్తకం, ఆధార్‌కార్డు, కౌలుదారుడి రేషన్, ఆధార్‌కార్డులతో కౌలు గుర్తింపు కార్డు కొరకు దరఖాస్తును పూర్తి చేసి వీఆర్వోకు అందజేయలన్నారు. అదే విధంగా వైఎస్సార్ రైతు భరోసా అర్హత ఉన్న ప్రతి రైతు అర్జీ పెట్టుకోవచ్చన్నారు.

పర్యావరణంపై అవగాహన



వినుకొండ (నూజెండ్ల): సామిల్ ఓనర్స్ బొగ్గుల కాంట్రాక్టర్స్‌లకు పర్యావరణహిత జీవన విధానం గురించి అవగాహన సదస్సు బుధవారం నిర్వహించారు. కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టిన పర్యావరణ జీవనవిధానం (మిషన్ లైఫ్) కార్యక్రమంలో భాగంగా ఉన్నతాధికారుల ఆదేశాలు మేరకు వినుకొండలోని అటవీశాఖ కార్యాలయంలో అటవీశాఖ సిబ్బంది ఆధ్వర్యంలో ఈ సదస్సు జరిగింది. ఈ సందర్భంగా పర్యావరణ పరిరక్షించడానికి రోజువారి జీవితంలో సాధ్యమయ్యే అన్నీ మార్పులు చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో వినుకొండ అటవీ క్షేత్రాధికారి సయ్యద్ హుస్సేన్, వినుకొండ వెస్ట్ సెక్షన్ సిబ్బంది పాల్గొన్నారు.

ఫిజియోథెరపీతో ఫిట్

సత్తెనపల్లి ఏరియా వైద్యశాలలో ఫిజియోథెరపీ సేవలు అందుబాటులోకి వచ్చాయి. వివిధ సమస్యలతో బాధపడుతున్న వారికి వ్యాయామాల ద్వారా చికిత్స అందించడానికి అధికార యంత్రాంగం ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేసింది. ఈ విభాగానికి కావాల్సిన అత్యాధునిక పరికరాలను ప్రభుత్వం అందిస్తోంది. పూర్తి స్థాయి సిబ్బందిని నియమించింది. మెరుగైన సేవలు అందిస్తుండడంతో రోగుల తాకిడి పెరుగుతోంది.

- అందుబాటులోకి అధునాతన పరికరాలు
- సత్తెనపల్లి ఏరియా వైద్యశాలలో ప్రత్యేక విభాగం
- ఫిజియోథెరపీ విభాగానికి పెరుగుతున్న రోగుల తాకిడి



ఏరియా వైద్యశాలలో ఫిజియోథెరపీ సేవలు పొందుతున్న రోగులు

సత్తెనపల్లి: పల్నాడు జిల్లా ముఖద్వారమైన సత్తెనపల్లి ఏరియా వైద్యశాలలో ఫిజియోథెరపీ విభాగం ఉంది. ఈ విభాగంలో ఇద్దరు వైద్యులు సేవలు అందిస్తున్నారు. చుట్టు పక్కల ప్రజలకు ఎలాంటి అనారోగ్య సమస్యలు వచ్చినా ప్రభుత్వ పరంగా సత్తెనపల్లిలోని పెద్ద ఆస్పత్రే (ఏరియా వైద్యశాల) దిక్కు. ఇక్కడ ఫిజియోథెరపీ విభాగం ఎప్పటి నుంచో పనిచేస్తోంది. కానీ ఈ విభాగానికి గత ప్రభుత్వ హయంలో అవసరమైన పరికరాలు అందుబాటులో లేక పెద్దగా స్పందన ఉండేది కాదు. ఇప్పుడు ప్రభుత్వం అన్ని రకాల పరికరాలను సమకూర్చడం, మెరుగైన చికిత్స అందించడంతో 2022 మార్చి 23 నుంచి రోజు వారీ ఓపీ సంఖ్య గణనీయంగా పెరుగుతూ వస్తోంది. పట్టణ వాసులే కాకుండా సత్తెనపల్లి, పెదకూరపాడు, తాడికొండ నియోజకవర్గాలలోని పలు మండలాలను నుంచి కూడా ఈ విభాగాన్ని ఆశ్రయిస్తున్నారు. ఈక్రమంలో ఓపీ సంఖ్య నిత్యం 30-40 దాటుతోందని వైద్యులు చెబుతున్నారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 4గంటల వరకు ఈ విభాగం పనిచేస్తోంది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఓపీ సేవలు చూడగా, మధ్యాహ్నం 2-4 గంటల సమయంలో అడ్మిట్లో ఉన్న ఆర్థో కేసులను చూస్తున్నారు.

పరికరాలు ఇలా ....

షార్ట్‌వేవ్ డయాథెరపీ, సర్వైకల్ ట్రాక్షన్, షోల్డర్ వీల్, షోల్డర్ పుల్లీ, టెన్స్, బ్యాగ్‌థెరపీ ఎలక్ట్రికల్ కిముటేషన్, వ్యాక్స్ థెరపీ, ఎలక్ట్రికల్ టిముటేషన్, హ్యాండ్ గ్రిప్పర్, ఫిజియోబాల్,బ్యాలెన్స్‌బోర్డ్, వాకింగ్ స్టూల్స్, స్టిక్స్, వాకర్, పార్లర్‌బార్ అండ్ మిర్రర్, వంటి పరికరాలను ఏర్పాటు చేశారు. వీటి ద్వారా శారీరక, కీళ్ల నొప్పులతో బాధపడుతున్న వారికి ఉచితంగా చికిత్స అందించి ఉపశమనం కలిగిస్తున్నారు. విద్యుత్ యంత్రాలు, పరికరాలు ఉపయోగించి కండరాలు, కీళ్ల, నరాల సామర్థ్యాన్ని పెంచడానికి వ్యాయామాల ద్వారా చికిత్స చేస్తున్నారు.

ఎవరెవరికి ఈ ఫిజియోథెరపీ ....

- శరీరంలో ఏదైనా ఎముక విరిగినా, కండరం నొప్పి పట్టినా .. వాటిని సాధారణ స్థితికి తీసు కురావడానికి మెరుగైన చికిత్స అందిస్తున్నారు.
- పక్షవాతం, మెడ, నడుం, భుజం, వెన్ను నొప్పుల నుంచి ఉపశమనం కల్పించ డానికి అవసరమైన అన్ని రకాల సేవలు ఉచితంగా అందిస్తున్నారు.
- నరాల బలహీనతలు, ఒకే చోట కూర్చుని పని చేయడం వల్ల వచ్చే సమస్యలకు ఉపశమనం కల్పించే వ్యాయామాలు, థెరపీలు ఇక్కడ అందుబాటులో ఉన్నాయి.
- దివ్యాంగులు, మానసిక ఒత్తిడితో సతమతమయ్యే వారికి ఈ చికిత్స బాగా పని చేస్తుంది.

ఈ ఏడాది ఓపీ వివరాలు ఇలా

నెల	ఓపీ సంఖ్య
జనవరి	540
ఫిబ్రవరి	478
మార్చి	540
ఏప్రిల్	553



హ్యాండ్స్ ఫిజియోథెరపి సేవలు పొందుతున్న రోగులు

ఇప్పుడిప్పుడే అడుగులు పడుతున్నాయి



మా పాప పుట్టినప్పటి నుంచి కూర్చోలేదు. వయస్సు పెరుగుతున్నా నడక సాగడం లేదు. ఫిజియోథెరపీకి వచ్చాక కొద్ది రోజులకే కూర్చోగలిగింది. మూడు నెలల నుంచి క్రమం తప్పకుండా తీసుకు వస్తున్నా. 80 శాతం వరకు మార్పు వచ్చింది. నడిచేందు కు ఇప్పుడిప్పుడే అడుగులు పడుతున్నాయి. ఇంకో 20 శాతం మార్పు వస్తే చక్కగా నడవ గలదని మా ఆశ. సత్తెనపల్లి ఏరియా వైద్యశాలలో సేవలు బాగున్నాయి.

–కొలకలూరి అనూషా, తక్కెళ్ళపాడు, ఫిరంగిపురం మండలం

రోగుల సంఖ్య పెరుగుతోంది



వివిధ శారీరక సమస్యలతో ఫిజియోథెరపీ కోసం ఆస్పత్రికి వస్తున్న రోగుల సంఖ్య పెరుగుతోంది. గతంలో రోజుకు 10 నుంచి 20 మంది మాత్రమే వచ్చేవారు. ప్రస్తుతం ఆ సంఖ్య 40 దాటింది. ప్రభుత్వంతో పాటు దాతల ద్వారా పరికరాలు సమకూర్చడం, సిబ్బందిని నియమిచడంతో ఫిజియో థెరపీ సేవలు సకాలంలో అందుతు న్నాయి. ఈ ఫలితంగా రోగుల సంఖ్య మరింత పెరగవచ్చు. ప్రభుత్వ ఆశయ మేరకే తాము పనిచేస్తున్నాం.

– అమర్తలూరి.జీవనజ్యోతి, ఫిజియోథెరపీ, సత్తెనపల్లి.

క్రమం తప్పకుండా చేయించాలి



ఫిజియోథెరపీ క్రమం తప్పకుండా చేయించుకోవాలి. ఇంటి వద్ద కూడా ప్రతి రోజు కొంత సమయం కేటాయించి చేస్తూ ఉంటే మంచి మార్పులు కనిపిస్తాయి. సత్తెనపల్లి ఏరియా వైద్యశాలలో ఫిజియోథెరపీ విభాగానికి ఇటీవల తాను కొత్తగా వచ్చాను. ప్రస్తుతం ఎక్కువ మంది ఫిజియోథెరపీ సేవలు వినియోగించు కుంటున్నారు. రోగుల కు మంచి సేవలు అందించాలనే ఉద్దేశంతో పని చేస్తున్నాం.

–నందిగం కరుణాకర్, ఫిజియోథెరపీ, సత్తెనపల్లి

పేదలకు చేరువగా సేవలు



ప్రైవేట్ వైద్యశాలల్లో వేల రూపాయిలు ఖర్చు చేసే పని లేకుండా ప్రభుత్వం వైద్య రంగానికి పెద్దపీట వేసింది. కార్పొరేట్ వైద్యం సైతం పేదలకు ఉచితంగా అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. గతంలో ఫిజియోథెరపీ విభాగం ఉన్నట్లు కూడా రోగులకు తెలిసేది కాదు. రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు చొరవ తో ఈ విభాగానికి కావాల్సిన పరికరాలు, సిబ్బంది నియామకం చేయడంతో రోగుల సంఖ్య పెరుగుతుంది. పేదలందరికీ ఫిజియోథెరపీ సేవలు చేరువయ్యాయి.

– కొత్త రామకృష్ణ, డైరెక్టర్, ఏరియా వైద్యశాల అభివృద్ధి కమిటీ

లక్ష్మీనర్సింహస్వామి పవళింపుసేవలు



అలంకరించిన ఊయలపాన్పుపై లక్ష్మీనర్సింహస్వామి వార్ల ఉత్సవమూర్తులు

నకరికల్లు: స్థానిక చౌత్రాసెంటర్‌లో శ్రీలక్ష్మీనర్సింహస్వామి వారి పవళింపుసేవ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్థానిక కొండపై గల శ్రీఆదిలక్ష్మి చెంచులక్ష్మీ సమేత శ్రీలక్ష్మీనర్సింహస్వామి కల్యాణ వేడుకల్లో భాగంగా బుధవారం పవళింపు సేవ కార్యక్రమం శాస్త్రోక్తంగా జరిపించారు. ఆలయ అర్చకులు కొడవటిగంటి మధుసూధనాచార్యులు, పాండురంగాచార్యులు చౌత్రాసెంటర్‌లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మండపంలో ఊయలపాన్పుపై స్వామివార్ల ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించారు. ఆర్యవైశ్యసంఘం ఆధ్వర్యంలో మహిళాభక్తులు స్వామివారి భజనా కార్యక్రమంలో అధికసంఖ్యలో పాల్గొన్నారు. స్వామివార్లను, అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు చెల్లించారు. ఈ సందర్భంగా అర్చకులు మధుసూధనాచార్యులు మాట్లాడుతూ ఈనెల 20వతేదీ శనివారం వరకు పవళింపుసేవలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 20వతేదీన 16 రోజుల పండుగ సందర్భంగా కొండ వద్ద పెద్దఎత్తున తిరునాళ్ల మహోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు.

వరిలో మిరాభి మోడల్‌పై రైతులకు శిక్షణ



ప్రకృతి వ్యవసాయం గురించి రైతులకు సూచనలిస్తున్న అధికారులు

నకరికల్లు: నవధాన్యాల సాగుతో నేలలో జీవవైవిధ్యం పెరుగుతుందని రైతుసాధికారిక సంస్థ రీజనల్ కో ఆర్డినేటర్ వెంకటరావు, ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు జిల్లా మేనేజర్ అమలాకుమారి తెలిపారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో నవధాన్యాల సాగు, వరిలో మిరాభి మోడల్ సాగుపై మండలంలోని దేచవరం గ్రామంలోని రైతులకు బుధవారం శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 30 రకాల విత్తనాలను 12 కేజీలు తీసుకుని రుతుపవనాలకు ముందుగా పొలాల్లో చల్లాలన్నారు. 30 రకాల విత్తనాలు ఉండడం వల్ల నేలల్లో జీవవైవిధ్యం పెరగడమే కాక అవసరమైన కూరగాయలు, ఆకుకూరలు ఉత్పత్తి అవుతాయన్నారు. అనంతరం వరి విత్తుకోడానికి ఎకరాకు రెండున్నర లేదా మూడుకేజీల విత్తనాలు సరిపోతాయన్నారు. వరి విత్తనాలను బీజామృతంతో శుద్ధి చేస్తే చీడపీడలు ఆశించవన్నారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా ఎకరాకు రూ.4వేల ఖర్చుతో 40 బస్తాల దిగుబడి సాధించిన రైతు లక్ష్మణ్ తన అనుభవాలను పంచుకున్నాడు. అనంతరం ప్రకృతిసాగు విధానాన్ని రైతులకు వివరించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ భవనం రాఘవరెడ్డి, ప్రకృతి వ్యవసాయ రైతులు శ్యామల శ్రీనివాసరెడ్డి, కొండా శ్రీనివాసరెడ్డి, ఏరువ పెద్దిరెడ్డి, మాస్టర్ ట్రైనర్‌లు నందకుమార్, సైదయ్య, యూనిట్ ఇన్‌చార్జిలు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

మిరపలో సస్యరక్షణపై అవగాహన



మాట్లాడుతున్న సీహెచ్ జనని

పీసపాడు(క్రోసూరు): మండలంలోని పీసపాడులో బుధవారం ఉద్యానశాఖ ఆధ్వర్యంలో మిరప పంటలో తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉద్యానశాఖ అధికారి సీహెచ్ జనని మాట్లాడుతూ మిరప పంటలో ప్రస్తుతం ఖరీఫ్ సన్నద్ధం కోసం లోతు దుక్కులు తీసుకోవాలని, అలా చేయడం వల్ల భూమిలో ఉన్న తెగుళ్లకు సంభందించిన, శిలీంద్రాలు, పురుగులకు సంబంధించిన గ్రుడ్లు, లార్వాలు, నాశనం చేయవచ్చునని అన్నారు. నల్లతామర పురుగు లార్వాదశలో భూమిలో ఉండిపోతుంది కాబట్టి తప్పనిసరిగా లోతు దుక్కులు తీసుకోవాలన్నారు. రైతుభరోసా కేంద్రాల ద్వారా రైతులకు సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలు జనుము, జీలుగ, పిల్లిపెసర అందిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం రైతులు విత్తనాలు కొనుగోలు చేసేతప్పుడు తప్పని సరిగా దుకాణాల్లో విత్తన రశీదు తీసుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. రశీదులో రకం పేరు, లాట్‌నెంబర్, ఉండాలని తెలిపారు. ఉద్యానశాఖలో అమలవుతున్న డ్రిప్ , స్పింకర్లు, కావాల్సిన రైతులు రైతు భరోసా కేంద్రంలో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. కేంద్రప్రభుత్వం అమలు చేస్తున్న పీఎం-ఎఫ్ఎంఈ పథకంలోని ఫుడ్ ప్రాసెసింగ్ గురించి రైతులకు తెలియజేశారు. కార్యక్రమంలో గ్రామవ్యవసాయసహాయలు పవన్, పీసపాడు సర్పంచ్ రాజే, సిబ్బంది పాల్గొన్నారు.

గుంతను తప్పించబోయి ఢీకొన్న లారీలు

శావల్యాపురం: మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై లారీలు ఢీకొన్న సంఘటన మంగళవారం అర్ధరాత్రి సమయంలో చోటుచేసుకుంది. ఎస్సై గల్లా రవికృష్ణ తెలిపిన వివరాలు మేరకు వినుకొండ నుంచి మిరపకాయల లోడుతో గుంటూరుకు వెళుతున్న లారీ అదేవిధంగా గుంటూరు నుంచి వినుకొండకు కొబ్బరికాయలు లోడుతో వస్తున్న లారీలు మార్గమధ్యంలో శావల్యాపురంలో ఎదురుగా ఉన్న గుంతను తప్పించపోయి ఢీకొన్నాయని తెలిపారు. సంఘటన స్థలానికి పోలీసులు చేరుకుని ట్రాఫిక్ అంతరాయం వాటిల్లకుండా సత్వరమే క్రేన్ సహాయంతో రోడ్డుకు అడ్డంగా పడిపోయిన రెండు లారీలను పక్కకు తప్పించారు.ఈప్రమాదంలో లారీ డ్రైవరుకు తీవ్రమైన గాయాలు కాగా వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించామన్నారు.

రైతు భరోసా దరఖాస్తుకు నేడు చివరి తేదీ



కోనూరులో రైతులనుద్దేశించి మాట్లాడుతున్న ఏఓ సుగుణాబేగం

అచ్చంపేట: అర్హత ఉండి ఇంతవరకు రైతుభరోసా పథకానికి దరఖాస్తు చేసుకోని రైతులు ఈనెల 18 సాయంత్రంలోపు దరఖాస్తు చేసుకోవాలని ఏఓ షేక్ సుగుణా బేగం తెలిపారు. ఖరీఫ్ సాగుకు సమాయత్తం కార్యక్రమంలో భాగంగా మండలంలోని కొనూరు, కస్తల గ్రామాల్లోని రైతుభరోసా కేంద్రాలవద్ద బుధవారం నిర్వహించిన రైతు అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. అర్హత ఉన్న ప్రతి రైతు, రైతుభరోసా పథకం ద్వారా పెట్టుబడి నగదు పొందవచ్చన్నారు. రైతులు తమ భూములను వేసవి దుక్కులు దున్నుకుని సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. లైసెన్స్ ఉన్న డీలరు వద్ద విత్తనాలు కొనుగోలు చేయాలని, అలా కొనుగోలు చేసిన విత్తనాలకు బిల్లులు తప్పనిసరిగా తీసుకుని పంట కాలం పూర్తయ్యేంతవరకు భద్రపరచుకోవాలని చెప్పారు. రైతు భరోసా కేంద్రాల్లో 50 శాతం సబ్సిడీపై పచ్చిరొట్టె విత్తనాలు పొందవచ్చన్నారు. రైతులు పంట సాగు హక్కు పత్రాలను పొంది వాటి ద్వారా బ్యాంకుల్లో వడ్డీలేని రుణాలు పొందవచ్చని చెప్పారు. ప్రతి రైతు ఈకేవైసి చేయించుకోవాలని సూచించారు. పశువైద్యాధికారి స్వాతీదేవి మాట్లాడుతూ పాలదిగుబడిన పెంచుకునేందుకు పశువులకు వాక్సినేషన్ చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ, పశుసంవర్ధకశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల్లో ఫ్యామిలీ డాక్టర్ వైద్య సేవలు



గుడిపూడిలో ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాంలో రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ ప్రదీప్



పాకాలపాడులో ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాంలో రోగులకు వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్ అనూష

సత్తెనపల్లి: మండలంలోని గుడిపూడి గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాంలో భాగంగా ఫణిదం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ వి.ప్రదీప్ బుధవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. మొత్తం 174 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. వీరిలో జనరల్ ఓపి 36 మంది, హైపర్ టెన్షన్ 65 మంది, డయాబెటిస్ 61 మంది, గర్భిణులు ఏడుగురు, ఇతర వ్యాధులకు సంబంధించి నలుగురికి వైద్య సేవలు అందించారు. అనంతరం దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతూ నడవలేక గృహాల్లో ఉండే వారికి వైద్య సేవలు అందించారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి చిన్నారులకు ఆరోగ్య విషయాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎమ్ఎల్‌హెచ్‌పీ వి.కౌసల్య, హెల్త్ సూపర్‌వైజర్ జె.సంపూర్ణాదేవి, ఎంపీహెచ్ఎ(ఎమ్) షేక్ సుభాని, డీఈఓ కె.సుధాకర్, ఆశా కార్యకర్తలు టీ.లక్ష్మీ తిరుపతమ్మ, జి.శివపార్వతి, డి.పార్వతి,కె.హైమావతి, ఎస్ శెరమ్మ, తదితరులు ఉన్నారు.

పాకాలపాడు గ్రామంలో....

మండలంలోని పాకాలపాడులో ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాంలో భాగంగా సత్తెనపల్లి పీపీ యూనిట్ వైద్యాధికారిణి డాక్టర్ అనూష బుధవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. మొత్తం 186 మందికి వైద్య పరీక్షలు చేశారు. వీరిలో హైపర్ టెన్షన్ 78 మంది, డయాబెటిస్ 66 మంది, గర్భిణులు 16 మంది, బాలింతలు ఐదుగురు, చిన్నారులు ఐదుగురు ఉన్నారు. అనంతరం నడవలేక దీర్ఘకాలిక వ్యాధులతో బాధ పడుతూ రాలేని వారి ఇళ్లకు వెళ్లి వైద్య సేవలు అందించారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి చిన్నారులకు ఆరోగ్య మెలకువలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ పెండెం మణిరావు, ఎమ్ఎల్‌హెచ్‌పీ జె.రమాదేవి, ఏఎన్ఎం సీహెచ్ రామలక్ష్మి, ఎంపీహెచ్ఎ(ఎమ్) బి కిరణ్ కుమార్, ఆశా కార్యకర్తలు కె.జయ సుధ, షేక్ మహబీ, తదితరులు ఉన్నారు.

గృహంలో అగ్నిప్రమాదం



అగ్నిప్రమాందతో నల్లగా మారిన గోడలు

సత్తెనపల్లి: న్యాయవాది గృహంలో అగ్ని ప్రమాదం జరిగిన ఘటన పట్టణంలోని పార్క్ ఏరియాలో మంగళవారం అర్ధరాత్రి జరిగింది. పట్టణంలోని పార్క్ ఏరియాలో నివసిస్తున్న న్యాయవాది కంబాల అనీల్ కుమార్ నూతన గృహంలో పై అంతస్తును బట్టల వ్యాపారి దేశు శ్రీనివాసరావుకు అద్దెకు ఇచ్చాడు. ఆ ఇంట్లో ఏర్పాటు చేసిన ఏసి స్టెబిలైజర్ నుంచి ప్రమాదవశాత్తు అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. గృహంలో ఉన్న వారు బయటకు పరుగులు తీయడంతో ఏసి పగిలిపోయి ఇంటి పైభాగానికి ఏర్పాటు చేసిన సీలింగ్ కూలిపోయింది. కింద ఉన్న డబల్ కాట్ మంచం, పరుపు, విక్రయం నిమిత్తం తెచ్చిన నూతన దుస్తుల బేళ్ళు కాలిపోయాయి. ఇంటి యజమానికి సుమారు రూ. 3 లక్షల వరకు నష్టం వాటిల్లగా, అద్దెకు ఉంటున్న దేశు శ్రీనివాసరావుకు చెందిన ఏసీ, ఇన్వర్టర్, నూతన దుస్తులు సుమారు రూ. లక్షలకు పైగా నష్టం వాటిల్లింది. పట్టణ సీఐ యు.శోభన్ బాబు నేతృత్వంలో పోలీసులు, అగ్నిమాపక అధికారులు ఘటనా స్థలాని కి చేరుకుని మంటలను ఆర్పి వేశారు. విద్యుత్‌శాఖ అధికారులు ఎంతసేపటికి స్పందించకపోవడంతో కొంత ఇబ్బంది ఏర్పడింది.

రీ సర్వే వేగవంతం చేయాలి

ముప్పాళ్ళ: మండలంలో జరుగుతున్న రీ సర్వే ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని తహసీల్దార్ ఎం.భవానిశంకర్ చెప్పారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వోలతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఇప్పటి వరకు 82% పూర్తయిందని, ఈ నెలాఖరునాటికి 90 శాతం పూర్తి చేయాలన్నారు. గ్రామాల్లోని రైతులకు అవగాహన కల్పిస్తూ సర్వే ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. సచివాలయం ద్వారా అందే అర్జీలను వెంటనే పరిష్కరించాలన్నారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ సీహెచ్ లక్ష్మీప్రసాదు, ఆర్ఐలు పవన్‌కుమార్, కపిల్‌దేవ్, అంజనేయులు, ఆయా గ్రామాల వీఆర్వోలు పాల్గొన్నారు.

యువతి అదృశ్యంపై కేసు నమోదు

సత్తెనపల్లి: తాతయ్య మందలించాడనే నెపంతో ఇంటి నుంచి వెళ్లిపోయిందని తాత ఇచ్చిన ఫిర్యాదు మేర కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ బుధవారం తెలిపారు. పట్టణంలోని 24వ వార్డుకు చెందిన యువతి ఫోన్‌లో వేరొక అబ్బాయితో మాట్లాడుతుండడాన్ని గమనించి తాతయ్య మందలించాడు. ఈ నేపథ్యంలో యువతి మంగళవారం సాయంత్రం నాలుగు గంటలకు ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఇంటి నుంచి వెళ్లిపోయింది. రాత్రి వరకూ ఇంటికి రాని కారణంగా చుట్టుపక్కల విచారించినా ఆచూకి లభించకపోవడంతో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో తాతయ్య వీరయ్య ఫిర్యాదు చేశాడు. ఆ మేర కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

24న వాహనాల వేలం

నకరికల్లు: మద్యం కేసులో పట్టుబడిన ఆటో, ద్విచక్రవాహనం ఈనెల 24వతేదీన బహిరంగవేలం నిర్వహించనున్నట్లు ఎస్ఐ పి.సురేష్ బుధవారం తెలిపారు. వాహనాలు కావలసిన వారు బహిరంగవేలంలో పాల్గొని వేలంపాటలో హెచ్చుపాటను చెల్లించి వాహనాలు పొందవచ్చన్నారు. వివరాలకు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని సూచించారు.

టింబర్ డిపోలో అగ్ని ప్రమాదం

చిలకలూరిపేటటౌన్: గుర్తు తెలియని వ్యక్తి తాగి పడవేసిన సిగరెట్ కారణంగా టింబర్ డిపోలో అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. అగ్ని మాపక సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని భాస్కర్ థియేటర్ సెంటర్ ఎదురు ఉన్న టింబర్ డిపో బయట ఉన్న కలపకు ఒక్కసారిగా మంటలు అంటుకున్నాయి. గమనించిన స్థానికులు అగ్నిమాపక శాఖకు సమాచారం అందించగా స్పందించిన వారు అక్కడి కి చేరుకొని మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. దీంతో పెను ప్రమాదం తప్పింది.

మోడల్ స్కూల్‌లో ప్రవేశానికి దరఖాస్తులు

రొంపిచర్ల: మండలంలోని వి.రెడ్డిపాలెం ఏపీ మోడల్ స్కూల్‌లో 2023-2024 సంవత్సరానికిగాను 6వ తరగతి, ఇంటర్మీడియట్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతున్నట్లు ప్రిన్సిపాల్ బి.రవినాయక్ బుధవారం తెలిపారు. 6వ తరగతిలో చేరటానికి ప్రవేశ పరీక్ష ద్వారా, ఇంటర్మీడియట్‌లో చేరేందుకు 10వ తరగతి మార్కుల ఆధారంగా ఎంపిక జరుగుతుందన్నారు. 6వ తరగతి ప్రవేశం కోరే విద్యార్థులు సెప్టెంబర్ 2011 నుండి ఆగష్టు 2013వ సంవత్సరం మధ్య జన్మించి ఉండాలన్నారు. ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో 2021-22, 2022-23 సంవత్సరాలలో చదివి ఉండాలన్నారు. 5వ తరగతి పూర్తి చేసుకుని 6వ తరగతికి ప్రమోషన్ అర్హత కలిగి ఉండాలన్నారు. ప్రవేశ పరీక్షలో సాధించిన మార్కుల ఆధారంగా, ప్రభుత్వ రిజర్వేషన్ ప్రకారం ఎంపిక జరుగుతుందన్నారు. అర్హులైన విద్యార్థులు ఈ నెల 25వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు పాఠశాలలో సంప్రదించాలన్నారు. ఫోన్ ద్వారా అయితే 9701030357. 7032996451 నంబర్లను సంప్రదించాలని ఆయన కోరారు.

వడదెబ్బకు గురికాకుండా జాగ్రత్తలు పాటించాలి

నాదెండ్ల: వేసవిలో వడదెబ్బకు గురికాకుండా తగు జాగ్రత్తలు పాటించాలని సర్పంచ్ సింగారెడ్డి లక్ష్మి చెప్పారు. మండలంలోని చిరుమామిళ్ళ గ్రామంలో బుధవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని సర్పంచ్ ప్రారంభించారు. గర్భవతులు, బాలింతలు, చిన్నారులకు పరీక్షలు చేసి, అవసరమైన వారికి మందులు అందించారు. పౌష్టికాహారం, వేసవిలో వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో చలివేంద్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఆరోగ్యకరమైన జీవన శైలిని ప్రతి ఒక్కరూ పాటించాలన్నారు. జంక్‌ఫుడ్, రెడీమేడ్ ఫుడ్ వాడకం తగ్గించి, తాజా పండ్లు, కూరగాయలు వాడాలన్నారు. ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నియంత్రించాలన్నారు. అనంతరం మొక్కలు నాటారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

